క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.33, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 28, గుండుబీన్స్ 105, గిం జ చిక్కుడు 65, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 35, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు సంకష్టహర చతుర్థి

సనత్‌నగర్: సంకష్టహర చతుర్థి సందర్భంగా నేడు సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలోని గణపతి ఆలయంలో ఉదయం 6.30 నుంచి గణపతి హోమం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం ఉంటాయన్నారు.

ఈ నెల 10న జాతీయ లోక్ అదాలత్

బన్సీలాల్‌పేట్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు రాజీ చేసుకోవాలని గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు సూచించారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10న కోర్టు జాతీయ లోక్ అదాలత్ ఉందని ప్రజలు ఆయా కేసులకు సంబంధించి ఇరువర్గాలు రాజీ అయి కేసులను తొలగించుకునే అవకాశం ఉంటుందన్నారు.

రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలకు చెక్



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో రహదారులను విస్తరించి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ సామల హేమ పేర్కొన్నారు. సీతాఫల్‌మండి ఫ్లై ఓవర్ ప్రాంతంలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై మంగళవారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి చర్చించారు. అనంతరం పరిసర ప్రాంతాల ప్రజలను కలిసి ఇక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ.. శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకెళ్లి ఫ్లై ఓవర్ ప్రాంతంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ టౌన్ ప్లానర్ ముంతాజ్‌ఖాన్, ఏఈ కౌశిక్, బీఆర్‌ఎస్ నాయకుడు రాజ సుందర్ పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, గందె సక్కుబాయి, గున్నాల ప్రభావతి, లలితా సత్సంగ్ సభ్యులు పాల్గొన్నారు.

బోనాల నిధులకు 10లోపు దరఖాస్తు చేసుకోవాలి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం బోనాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందని ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ ఎం.రామకృష్ణారావు తెలిపారు. బర్కత్‌పుర తుల్జాభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. బోనాల వేడుకలకు ప్రభుత్వం ఆలయాలకు నిధులను సమకూర్చుతోందని నిర్వాహకులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ఆలయాల నిర్వాహకులు గతేడాది యూసీతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల్లో సెంట్రల్ పీస్ కమిటీ

కాచిగూడ: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వేడుకల్లో సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు పాల్గొని పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పీస్ కమిటీ ప్రధానకార్యదర్శి కిషన్ శర్మ, అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.శరత్ శ్యామ్ తెలిపారు. మంగళవారం బర్కత్‌పురలో వారు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ ప్రజలందరూ సంతోషంగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, మజారొద్దీన్, శశికాంత్ అగర్వాల్, యూసుఫ్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఇలా.. నీరు ఇంకేదెలా?



సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం గ్రౌండ్‌లో

- నిర్వహణ లేక కనుమరుగవుతున్న ఇంకుడు గుంతలు
- వర్షాకాలం సమీపిస్తున్నా స్పందించని జీహెచ్ఎంసీ, జలమండలి
- మరమ్మతులు చేయాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

సనత్‌నగర్: భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇంకుడు గుంతల ప్రక్రియ కొన్ని ప్రాంతాల్లో సత్ఫలితాలిస్తున్నా కొన్ని చోట్ల వాటి నిర్వహణ కరువై కనుమరుగవుతున్నాయి. వర్షాకాలం సమీపిస్తున్నా ఇంకుడు గుంతల జాడ కనిపించడం లేదు. జీహెచ్‌ఎంసీ, జలమండలి ఈ సారి జలసిరులను ప్రసాదించే ఇంకుడుగుంతల జోలికి వెళ్లకపోవడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కొత్త వాటి నిర్మాణం మాట అలా ఉంచితే..గతంలో విస్తృతంగా చేపట్టిన ఇంకుడుగుంతల నిర్వహణ అయినా సరిగా ఉందా? అంటే లేదనే చెప్పాలి. జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాలు గత కొన్నేళ్ల క్రితం పోటాపోటీగా చేపట్టిన ఇంకుడుగుంతల నిర్మాణాలపై పర్యవేక్షణ లేకపోవడంతో సగానికి పైగా కనుమరుగయ్యాయి.

పదుల సంఖ్యలో నిర్మాణం..

సనత్‌నగర్, బల్కంపేట్, అమీర్‌పేట్, బేగంపేట డివిజన్‌లలో సాధారణ రోజుల్లోనే 800 ఫీట్ల వరకు తవ్వితే గానీ నీరు రాని పరిస్థితి. ఇక వేసవి కాలం వచ్చిందంటే భూగర్భ జలాలు ఇంకిపోయి 1200 ఫీట్లు వరకు తవ్వినా నీరు వస్తుందో రాదో తెలియదు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కడానికి ఇంకుడు గుంతల ద్వారా నీటిని విరివిగా భూమిలో ఇంకేలా చేయాల్సిన అవసరం ఉందని అధికారులూ భావించి జీహెచ్‌ఎంసీతో పాటు జలమండలి శాఖ అధికారులు కూడా సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఇంకుడు గుంతలను నిర్మించారు. ఈ ఏడాది కొత్త వాటిని నిర్మించకపోయినా పాత వాటిని పునరుద్ధరించే చర్యలు కూడా చేపట్టకపోవడం విచారకరం.

వ్యర్థాలకు నిలయంగా..

ఒక్కో ఫీట్‌కు 70 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు చేసిన పరిస్థితి ఉంది. పెద్ద మొత్తంలో ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఇంకుడు గుంతలను ఒక్క ఏడాది నిర్వహణతోనే సరిపుచ్చి వాటిని పట్టించుకోకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేశారు. త్వరలోనే వర్షాలు ప్రారంభమవుతున్నా పాత వాటికి మరమ్మతులు చేపట్టి నీరును ఇంకేలా చర్యలు చేపట్టకపోవడంపై అధికారుల తీరును ప్రజలు విమర్శిస్తున్నారు. కొన్ని ఇప్పటికే కనుమరుగు కాగా.. మరికొన్ని మట్టి, చెత్తా చెదారంతో పూడుకుపోయి నీరు ఇంకే పరిస్థితి లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఇంకుడు గుంతలను పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సనత్‌నగర్ మీ-సేవా వెనుక రోడ్డులో..

పదివేల 'డబుల్' ఇళ్ల హామీని నెరవేర్చాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గంలో పదివేల డబుల్ బెడ్రూమ్‌ల హామీని డిప్యూటీ స్పీకర్ పద్మారావు నెరవేర్చి, పూర్తయిన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణం, కేటాయింపుల్లో డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం అఖిలపక్ష పార్టీలు చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో పదివేల డబుల్ ఇళ్లు నిర్మిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన పద్మారావు ఇప్పటి వరకు కేవలం 400 ఇళ్లు మాత్రమే నిర్మించారని ఆరోపించారు. పూర్తయిన ఇళ్లను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకే కేటాయించి, నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలకలగూడ, ధోబీఘాట్, సీతాఫల్‌మండి ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్‌లలో నిర్మించిన ఇళ్ల కేటాయింపుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అసలైన లబ్ధిదారులకే ఇళ్లను కేటాయించాలని లేకుంటే డిప్యూటీ స్పీకర్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ, టీజేఎస్, సీపీఎం, ఆప్, బీఎస్పీ పార్టీలకు చెందిన నాయకులు కాంపల్లి శ్రీనివాస్, నరసయ్య, అజయ్‌బాబు, రాకేష్‌సింగ్, నరసింహారావు, ఉమర్‌ఖాన్, కొమురెల్లి బాబు, కుమార్, రవికాంత్, రామప్ప, ఎల్లయ్య, అజయ్, జావేద్, సోమయ్య, యాదగిరి, షేక్‌లతీఫ్, రషీద్, లక్ష్మణ్, లక్ష్మీ, వీరయ్య, ఖాసీం పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సనత్‌నగర్‌లోని ఆమె కార్యాలయానికి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు తీసుకువచ్చిన కేక్‌లను ఆమె కట్ చేశారు. తన జన్మదినం సందర్భంగా బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న మధ్యాహ్న మిత భోజన కేంద్రం వద్ద ఆమె అన్నదానం చేశారు. అంతకముందు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసానికి వెళ్లి కలువగా ఆమెకు మంత్రి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలు తనకిచ్చిన అవకాశాన్ని ఒక బాధ్యతగా స్వీకరించి నిరంతరం వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

ప్రజల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: వర్షాకాలం ఎదురయ్యే ఇబ్బందుల నుంచి ప్రజలకు సత్వర పరిష్కారం చూపించడం కోసం అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఏర్పాటు చేసిన మాన్సూన్ టీం వాహనాలను మంగళవారం జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వర్షాకాలంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ సత్వరమే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కంది శైలజ, టీఆర్‌ఎస్ నాయకులు రాజ సుందర్, బండారు మహేందర్ ముదిరాజ్, పాక సాయి, దయానంద్‌గౌడ్, భువనగిరి కిరణ్‌గౌడ్, ఓయూ రాజు పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న పద్మారావుగౌడ్

విద్యుత్ అధికారులతో సమావేశం..

తెలంగాణ అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఇన్వర్టర్లు, జనరేటర్ల అవసరాలు లేకుండా పోయాయన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా, రైతులకు ఉచితంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సత్ఫలితాలు సాధించిందన్నారు.

కళా సాహిత్యకేంద్రం త్యాగరాయ గానసభ

చిక్కడపల్లి: సంగీత నృత్యనాటక సాహిత్య కార్యక్రమాలకు కేంద్రంగా త్యాగరాయగానసభ జంట నగరాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా పేరు పొందిందని ప్రముఖులు పేర్కొన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభ 58వ వ్యవస్థాపక దినోత్సవంగా సభలోని కళాలలిత కళావేదికపై జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ జర్నలిస్టు, హాస్యఅవధాని శంకర నారాయణ పాల్గొని మాట్లాడారు. సాధారణంగా కళా వేదికలు సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయాలు. గానసభ కళా ప్రదర్శనలకే కాకుండా పేద వర్గాల వారికి వివాహాల కోసం సహకరించటం, వైద్య శిబిర నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలు చేయడం విశేషమన్నారు. ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కెవీరావు, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, శంకర్‌ప్రసాద్, మంజుల తదితరులున్నారు. మంజుల శిష్యబృందం త్యాగరాజ కీర్తనలు ఆలపించగా సభికులను అలరించింది.

అంగన్వాడీలో బడిబాట

అడ్డగుట్ట: రెండున్నర సంవత్సరాల పైబడిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్య సూచించారు. మంగళవారం అడ్డగుట్టలోని అంగన్‌వాడీ-3 సెంటర్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు, పిల్లలు ప్లకార్డులు ప్రదర్శన చేశారు. అంగన్వాడీలో అందించే పోషక విలువలతో కూడిన ఆహారం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా అంగన్‌వాడీ నిర్వాహకులు తెలిపారు.



మేడిబావి కమ్యూనిటీహాల్లో తరగతులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కళాశాల భవనం నిర్మాణం పనులు పూర్తయ్యే వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు మేడిబావిలోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్లో నిర్వహించనున్నారు. త్వరలో కళాశాల తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం కళాశాల అధ్యాపకులు సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్‌తో సమావేశమయ్యారు. కమ్యూనిటీహాల్లో తరగతి గదుల ఏర్పాట్లను సమీక్షించారు. కమ్యూనిటీహాల్‌తో పాటు పరిసర ప్రాంతాల రహదారులు ఇతరత్రా వసతుల ఏర్పాటుకు సంబంధించి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ ఇంజినీర్ కౌశిక్ అధ్యాపకులకు హామీ ఇచ్చారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

రాంగోపాల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం నల్లగుట్ట (ఓల్డ్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శౌరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శైలజ, ఉదయ్‌శ్రీ, రాధిక, సుమలత తదితరులు మంత్రిని కలిసి ఆయన చేతుల మీదుగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలపై తాను ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తున్నానని చెప్పారు. నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ సహాయంతో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి విద్యను అందించడం అభినందనీయమన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కంటోన్మెంట్: స్థానిక యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ నెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ తెలిపారు. కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ ఈ మేళాకు ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మధుకర్ నాయక్‌ను కలిసి బోర్డు తరఫున తగిన సదుపాయాలు కల్పించాలని కోరామన్నారు. సుమారు 90కి పైగా సంస్థలు పాల్గొనే ఈ జాబ్‌మేళా విజయవంతానికి తమ సహకారం ఎళ్లవేళలా ఉంటుందని సీఈఓ హామీ ఇచ్చారన్నారు.



సీఈఓ మధుకర్ నాయక్‌తో మాట్లాడుతున్న క్రిశాంక్

పర్యావరణ పరిరక్షణలో 'రాయల సేవా సమితి' పాత్ర కీలకం

అమీర్‌పేట: పర్యావరణ పరిరక్షణలో రాయల సేవా సమితి కీలక పాత్ర పోషిస్తుందని ప్రగతి గ్రూప్ చైర్మన్ జీబీకే. రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన దిశగా పనిచేస్తున్న వారిని సోమవారం రాత్రి అమీర్‌పేటలో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్రాప్స్, రాయల సేవా సమితి వంటి స్వచ్ఛంద సంస్థలు పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నాయన్నారు. పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల కలిగే నష్టాలు ప్రజలకు వివరించాలన్నారు. రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారని సూచించారు.



ఆర్.సి.కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జీబీకే రావు

కరాటేలో సత్తా



సనత్‌నగర్: ఛత్రినాక శివగంగానగర్‌కు చెందిన నాయక్ బుడోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో అమీర్‌పేట బ్రాంచ్ విద్యార్థులు సాహితీ (11), బాల సృజన్ (8), బాల లిఖిత్ (11) సత్తా చాటారు. నాయక్ బుడోకాన్ కరాటే అకాడమీ అధ్యక్షుడు గణేష్‌నాయక్ మాస్టర్ ఈ సందర్భంగా ప్రతిభ చూపిన చిన్నారులను అభినందించి అవార్డులు, బెల్టులు ప్రదానం చేశారు.

తొమ్మిది రోజులుగా మార్చురీలోనే..

జాడలేని గుర్తు తెలియని వ్యక్తి సంబంధీకులు



కంటోన్మెంట్: కొన ఊపిరితో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని కాపాడేందుకు పోలీసులు చేసిన ప్రయత్నం వృథా కాగా.. ప్రస్తుతం ఆ వ్యక్తి ఎవరో గుర్తించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరో తెలియకపోవడంతో 9 రోజులుగా గాంధీ మార్చురీలోనే ఉంచి ఎదురు చూస్తున్నారు. బోయిన్‌పల్లి ఎస్‌ఐ నాగేంద్ర బాబు వెల్లడించిన వివరాల మేరకు.. గత నెల 29న ఉదయం పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న పోలీసులకు ఓల్డ్ బోయిన్‌పల్లిలో అపస్మారక స్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లుగా సమాచారం అందింది. వెంటనే స్పందించిన పోలీసులు కొన ఊపిరితో ఉన్న వ్యక్తిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. మృతుడి వయసు 45-50 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు వెల్లడించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ముగిసిన మధ్యాహ్న మిత భోజన కార్యక్రమం



మధ్యాహ్న మిత భోజన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్

సనత్‌నగర్: బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న మిత భోజన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. దాతలు, వయోధిక పౌరుల సహకారంతో శ్రీనివాస సమాజ సేవా సమితి ట్రస్టీ పార్థసారధి నేతృత్వంలో 75 రోజుల పాటు అన్నదానం చేశారు. ముగింపు రోజు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నసంతర్పణ చేశారు. ఆమె అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, డాక్టర్ శ్యాంసుందర్‌రాజ్, బాలా త్రిపుర సుందరి దంపతులు, జీహెచ్‌ఎంసీ ఆసరా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగేశ్వరరావులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మండుటెండల్లో బాటసారుల ఆకలి, దప్పికను తీర్చడంలో శ్రీనివాస సమాజ సేవా సమితి ట్రస్టీ పార్థసారధితో పాటు వయోధికులు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విఠల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామమూర్తి, సత్యనారాయణ, అర్వింద్‌గౌడ్, కృష్ణదేవ్‌గౌడ్, జే ప్రసాద్, సుజాతమ్మ, రజినిరెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కంటోన్మెంట్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని కుల వృత్తులకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్) పిలుపునిచ్చారు. మంగళవారం బోయిన్‌పల్లిలో ఆయనను కలిసిన నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. నాయీ బ్రాహ్మణుల ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందజేయనుందని స్థానిక నాయీ బ్రాహ్మణులందరికీ లబ్ధి చేకూరేలా తనవంతు సహకారం అందజేస్తానని అన్నారు. సెలూన్లు ఉన్న నాయీ బ్రాహ్మణులకు విద్యుత్ బిల్లు మినహాయింపు ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో యాదగిరి, సాయిబాబా, కిరణ్, గణేశ్, వెంకట్, కిషన్, సుభాష్ పాల్గొన్నారు.



మహేశ్వర్ రెడ్డితో నాయీ బ్రాహ్మణ ప్రతినిధులు

రైలు ఢీకొని మహిళ మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 5వ తేదీన మేడ్చల్-మనోహరాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతున్న సుమారు 40 ఏళ్ల వయసున్న మహిళను రైలు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. రైల్వే పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభించలేదని మృతదేహాన్ని మార్చురీకి తరలించామన్నారు.

కాంగ్రెస్‌లోకి నోముల ప్రకాశ్‌రావు



సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావు కాంగ్రెస్‌లో చేరనున్నారు. మంగళవారం సీతాఫల్‌మండి ఎస్‌పీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఎన్నికల్లో తనకు రాజకీయ భవిష్యత్ ఇస్తామని హామీ ఇచ్చిన శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తమ పార్టీలో చేర్చుకున్నారని, ఆ తర్వాత తనకు పార్టీలో తగిన స్థానం కల్పించలేదన్నారు. దీంతో మళ్లీ కాంగ్రెస్‌లోకి చేరుతున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఏ.బీ బ్లాక్ అధ్యక్షులు సురేశ్‌లాల్, జగదీశ్వర్, మాజీ కార్పొరేటర్ ఎంఆర్ శ్రీనివాస్‌రావు, చేపూరి వెంకటేశ్వర్‌రావు, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్, కరీం, వహీదుద్దీన్, షకీల్‌ఖాన్, నర్సింగరావు, దామోదర్, అభిషేక్ పాల్గొన్నారు.